# "ఉన్మాది మనస్విని వాత్రి"

జీవితం ఎప్పుడో ఒక్క చుక్కను చేరుకుంటుంది. అది చేరుకున్నాక ఇక ముందుకు సాగదు. దానికిక వెనక చూపు, ముందుచూపు రెండూ ఉండవు. అక్కడే సుళ్ళు తిరిగి గిరగిరా తిరుగుతుంది. అప్పుడిక మృత్యువును కౌగలించుకోటం కంటె చేయగలిగిందేమీ లేదు, జీవించినా అది చైతన్యరహితమైన బ్రతుకు. బెదరిన చూపులతో, బెంగపడిన ముఖంతో రోజులు గడపడం మాత్రమే! విరిసిన పూవును మూచుకప్పి ఊపిరి సలుపనీయనట్లు బరువుగా రోజులు బ్రతుకును కప్పుతాయి.

తన బ్రతుకిప్పుడా చుక్కను చేరినట్లుంది. ఇంక ముందుకు పోవటానికి ఏమీ లేదు! మృత్యువును కోరి వరించటం దోషమా! మృత్యువు ఒడిలో తలదాచుకోటం పిరికితనమా! ఏమో? మనస్సంతా ఏదో దిగులూ, భయమూ, నిస్పృహా, అవమానమూ నిండుకున్నప్పుడు, అదే మతిభ్రమణము! అప్పుడే మనస్సు చీకటి మయమైనట్లు తోస్తుంది.

ప్రపంచమంతా ఒక త్రోవ! తానొకత్రోవ: నవ్వులు పరిహాసాలు, అలసిపోయిన చూపులూ, జారిన కన్నీరు,

ఆటలు, పాటలు, విలాసాలు, పసిపాపల పరుగులు, అన్నీ ఏదో తెరమీద జరుగుతున్న అర్థరహితమైన సినిమా! తెర ముందు కూర్చుని చూసే తనకు దానితో సంబంధం లేదు. ఆ కన్నీరు తనను అంటదు, ఆ చిరునవ్వు తనను తాకదు, ఏదో ఒక లోకంలోనుంచి మరొక లోకంలో జరుగుతున్న విషయాలు చూస్తున్నట్టుంది. చీకటి, వెలుగు, ఎండా, చల్లదనమూ అన్నింటికీ తేడా తెలియదు, మూతలు పడిన కన్నులలో పగలు నడచిపోతుంది, రెప్పపాటులేని వేదనలో రాత్రి గడుస్తుంది. తెల్లవారుతుంది. మళ్లా ఇంకోరోజు!

చలనంలేని రాతిబొమ్మలా తాను కదలలేదు! ఎక్కడో దూరంగా మాటలు వినిపిస్తాయి! "ఆమెకు మతిస్థిమితం లేదు. ఎప్పుడూ అలాగే కదలకుండా కూర్చుంటుంది." ఆ మాటలకు తిరిగి చూడాల్సిన పనిలేదు, అవి తనను గురించికాదు, తన కళ్లలో తిరిగే ఊహలు వారికి అంతుబట్టవు. తన మనస్సులో పాకుకున్న జడత్వం ఎందుకో వారికి తెలియదు.

ఎప్పుడో, ఎన్నాళ్ళ క్రిందటో ఎక్కడో జరిగిన సంగతి. "ఇది నా వస్తువు, దీన్ని వదిలెయ్యి" అన్నాడొక వ్యక్తి. "ఇది నాకక్కరలేదు, నా త్రోవన నన్ను పోనియ్యి." అన్నాడింకొక వ్యక్తి. ముందుకు అడుగువేసి సాగిపోయినాడు, వెనక్కు తిరిగి చూడకుండా! వెనక నిలచిన వ్యక్తి తన వస్తువును గట్టిగా పట్టుకున్నాడు, చెదరిపోకుండా! అది విరిగి ముక్కలు ముక్కలైంది. పట్టుకున్న వ్యక్తి చేయి

రక్తమయమైంది. పగిలిన ముక్కలు గుచ్చుకుని. విచిత్రం! వస్తువు ఆకారం చెడలేదు. అది ఇంకా అందమైన చందనపు పెట్టే! దూరంనుంచి చూస్తే ఇంకా అలాగే కనబడుతుంది. పొరపాటున ఏ చిటికెన వేలు తగిలినా చాలు! కుప్పగా కూలిపోతుంది. ఏమీ సందేహం లేదు.

ఆ దృశ్యం ఎప్పుడు ఎక్కడ జరిగింది! తనకు మతి చెడిపోవటానికి దానికి ఏమిటి సంబంధం? ఆ చందనపు పెట్టె ఏదో తన మెదడులో ఇరుక్కున్నట్లుంది! అటూ ఇటూ కదలితే రాలిపోతుందేమో! అలా అలా ఏదో భయం!

ఆ చందనపు పెట్టెకు తనలాగే మనస్సు ఉంటే! భావాలు ఉంటే! ఏవో అణచ శక్యంగాని కోరికలు ఉంటే? అప్పుడేమౌతుంది!? అప్పుడూ ఆ చేతిలోకి ఈ చేతిలోకి నిర్జీవంగా మారి శిథిలమౌతుందా! ఉన్మాది అనిపించుకుంటుందా! ఏవో వెర్రి తలలో వెర్రి ఆలోచనలు!

బ్రతుకంతా చీకటి మయమే అయితే బాధలేదు. బరువులేదు. ఏదో ఆశాకిరణంలా వెలుగు రేఖ క్షణకాలం కనిపించి మాయమైతే, అమావాస్య చీకటి గర్భంలో అల్పమైన చంద్రరేఖ అంకురించి మాయమైనట్లు, ఆ వెలుగు తరువాత ఆ చీకటి ఎంత భయంకరమౌతుంది! ఎంత వెతకినా. ఎన్నిసార్లు చేతులు వెర్రిగా జాపి పలవరించినా, పాముకాటు వేసినట్లు గుండెలు కుమిలినా, ఉన్మాదమే తప్ప తిరిగి కనిపించని వెలుగు రేఖ! ప్రాణాలు క్రుంగదీసే ఆ చీకటి, మెదడును కాల్చే ఆ ఆవేదనా, భరించలేక మనస్సు విలవిల లాడు

తుంది. క్షణకాలం మాత్రం నా కెందుకు కనిపించావు! నా అనంతమైన చీకటే నా కెందుకు దక్కనివ్వలేదు! ఈ వెలుగు రేఖను స్మరించుకుంటూ రెట్టింపైన ఈ చీకటి బరువు మోసే శ్రమ నా కెందుకు ప్రసాదించావు! ఆ ఒక్క క్షణం వెలుగు చూపటం నా మీద దయా? అమానుషమైన క్రూరత్వమా!

మనసును ముసురుకొనే ఈ వేదనే మతి చెరపినది. ఇదే తనకు ఉన్మాది అనే బిరుదు సంపాదించి పెట్టింది. ఇది క్షణం కదలి చేయి జారిన వెలుగురేఖ కోసమని ఎవరికి తెలుస్తుంది! ఆ తమస్సులో ఒక మరపురాని వెలుగురేఖ మెదలుతున్నదనే తెలియగు. అందుకే అందరూ అర్థంకాక తనకు అలా అలా దూరంగా పోతారు!

ప్రపంచానికి దూరమై, బంధనాలు తొలగి, రాగద్వేషాలు లేని జడస్థితిని తాను పొందింది. జీవితంలో కదలిక నశించింది కాలం ఆగదు. రోజులు నిలువవు పూలరేకుల్లా, పక్షి ఈకల్లా, ఒకదాని వెంబడి ఒకటి అలా గాలిలో తేలికగా ఎగిరి ఎగిరి వస్తూనే ఉంటాయి! తాను ఓ మూల నుంచి చూస్తూనే ఉంటుంది! అయితే ఎన్ని వచ్చాయి! ఎలా వచ్చాయి! నిన్న వచ్చిన దానికి ఇవ్వాళ వచ్చిన దానికి తేడా ఏమిటి! ఏమో! అదంతా ఎవరికి తెలుసు! అవి వరుసగా వస్తూనే ఉన్నాయి. అంతే తెలుసు. తాను నిద్రపోతున్నది నిన్నా ఇవ్వాళా! ఏమో!

చెదరిన తలలో ఏవో ఊహలు, దృశ్యాలు చెదరి చెదరి వస్తాయి! కలలో నిజమో! గంగానది ఉప్పొంగింది

ఎటుచూచినా భయంకరమైన జలప్రవాహం! చెట్లు, గుట్టలు, ఆవులు, మేకలు అన్నీ కల్లోలంగా ప్రవాహంలో సుళ్ళు తిరిగి కొట్టుకు పోతున్నాయి. ఎప్పుడూ ఈ దృశ్యమే మళ్లా మళ్లా కనిపిస్తుంది తనకు. భయం వేస్తుంది ఆ ప్రవాహం తన్ను చుట్టుకుంది. తనూ కొట్టుకు పోతున్నది. ఆగాలని ప్రయత్నించ లేదు. ఆగడానికి ఆధారమూ లేదు. హఠాత్తుగా కళ్ళు చీకట్లు కమ్మాయి. ప్రవాహం ఆగిపోయింది.

ఎక్కడో ఏదో కలలాగా సన్నగా వినబడుతోంది

"అమ్మయ్య, ఫరవాలేదు. ప్రాణం పోలేదు."

"ప్రాణం ఇంకా ఉన్నదా! ఎక్కడ!" నీరసించిన తన మెదడు, మగతగా ప్రశ్నించుకుంది.

తన నుదుటిమీద చల్లని చేయి పడితే ఆ మగత తేలి పోతుంది! ఆ ఉన్మాదం తొలగిపోతుంది, ఆ చేయి దూరంగా, చాలా దూరంగా ఉంది! మగత మళ్లా మళ్ళా కమ్ముకుంటోంది!

ఇంక విముక్తి లేదు.